క్లుప్తంగా

ఉత్సాహంగా పాటల పోటీలు



మానేపల్లి గ్రంథాలయంలో పాటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పి.గన్నవరం: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మానేపల్లి గ్రంథాలయంలో లైబ్రేరియన్ బి.నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఇందులో 45 మంది విద్యార్థులు పాల్గొనగా జి.రమ్యఅలేఖ్య, ఎం.మేఘన, కె.సాహితీసాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. బీఈ భవాని, కె.శివకామేశ్వరి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. శిబిరంలో కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, నాట్యం, సంగీతం, యోగా, గణితం, చదరంగం, నైతిక విలువలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. జూన్ 11న జరిగే ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందజేస్తామని నాగేంద్రకుమార్ తెలిపారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

మామిడికుదురు: మండలంలో మొబైల్ ఆధార్ శిబిరాలను మంగళవారం నుంచి నిర్వహిస్తామని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. మంగళవారం ఈదరాడ, కరవాక, ఆదుర్రు, బుధవారం కరవాక, గోగన్నమఠం, ఆదుర్రు, 25న లూటుకుర్రు, పాశర్లపూడిలంక, మామిడికుదురు–1 సచివాలయాల్లో, 30న మొగలికుదురు, కొమరాడ, 31న గెద్దాడ, పెదపట్నంలో శిబిరాలు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయని అన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

సఖినేటిపల్లి: పలు గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండల బీజేపీ శ్రేణులు సోమవారం స్థానిక స్పందనలో అధికారులకు అర్జీ అందజేశారు. ఈ మేరకు తహసీల్దార్ వై.రామకుమారి, ఎంపీడీఓ జి.భీమారావులకు ఆ పార్టీ నాయకులు మాలే శ్రీనివాస నగేష్, చెంపాటి శివరామకృష్ణంరాజు, తిరుమల వెంకటేశ్వరరావు, దివ్వి మారియ్యలు వినతి ఇచ్చారు. మోరిపోడు, వీవీమెరక, అప్పనరామునిలంక గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య ఉందన్నారు.

చోరీ కేసులో ముగ్గురికి జైలు

ఆలమూరు: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ముగ్గురికి జైలుశిక్ష విధిస్తూ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సోమవారం తీర్పును వెలువరించింది. స్థానిక ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం.. 2022 డిసెంబర్, 2023 జనవరిలో పెదపళ్లకు చెందిన కె.జార్జిబెన్నీ, సీహెచ్ ప్రసన్నకుమార్, పినపళ్లకు చెందిన షేక్ ఇబ్రహీంలు బైక్‌లు చోరీ చేసినట్లు కేసు నమోదైంది. వారి నేరం రుజువు కావడంతో జడ్జి డాక్టర్ దివ్య దైవకృప ముగ్గురికి రెండేళ్ల చొప్పున జైలుశిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధించారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర

అయినవిల్లి: స్థానికంగా సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు. మంగళవారం తీర్థ మహోత్సవం జరగనుంది.

చలివేంద్రం ప్రారంభం

అంబాజీపేట: గంగలకుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటైన చలివేంద్రాన్ని సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వీఆర్వో వక్కలంక నాగేశ్వరరావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టి కారు బోల్తా

ఆరుగురికి గాయాలు



హైవేపై బోల్తా పడిన కారు

రావులపాలెం: గోపాలపురం సెంటర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. తణుకు వైపు నుంచి వస్తున్న కారు స్థానిక గోపాలపురం జంక్షన్ వద్ద బైక్‌పై రోడ్డు దాటుతున్న పొడగట్లపల్లికి చెందిన జె.దుర్గాప్రసాద్‌ను ఢీకొంది. వెంటనే పక్కనున్న డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్‌తో పాటు కారు ప్రయాణిస్తున్న రంగంపేటకు చెందిన బి.సూర్యకుమారి, రాజు, కె.మంగా, శ్రీనివాసరావు, డ్రైవర్ ఎ.సత్యనారాయణకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెంకటరమణ తెలిపారు.

ఏమి హాయిలే అలా..

- అల్లుకున్న పచ్చదనం
- దారుల్లో పచ్చని హరివిల్లు
- ఎండల్లోనూ సేదతీరుతూ ప్రయాణం



కొత్తపేట- అమలాపురం రహదారిలో కండ్రిగ వద్ద పరుచుకున్న పచ్చదనం

కొత్తపేట: ఆ దారుల్లో హాయి హాయిలే.. హరివిల్లులా అల్లుకున్న పచ్చదనం మధ్య ప్రయాణం ఎంతో ఆహ్లాదమే.. కనులకు ఆనందమే.. నడినెత్తిన సూరీడు నిప్పులు కురిపిస్తున్న వేళ.. ఆ దారుల్లో నీడన మాటన.. చల్లగా సాగిపోవాల్సిందే.. కోనసీమలో పలు దారుల్లో ప్రయాణం సాఫీగా సాగిపోతోంది. ప్రధానంగా రావులపాలెం- అమలాపురం, బొబ్బర్లంక- రావులపాలెం, బోడిపాలెం- ముక్తేశ్వరం రహదారుల్లో ఇరుపక్కలా పచ్చని చెట్లు ముచ్చట గొలుపుతున్నాయి. రా రమ్మని ఆహ్వానిస్తున్నాయి. వేసవి తాపానికి సేద తీరాలనుకునే ప్రయాణికులకు ఆ చెట్ల పందిర్లు నీడనిస్తున్నాయి.

అమ్మో ఉక్కబోత..

గత కొద్ది రోజులుగా 40 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బయటకు రావాలంటేనే జనం హడలెత్తిపోతున్నారు. ఉక్కబోతతో అల్లాడుతున్నారు. ఉద్యోగులు, ఉపాధి నిమిత్తం కొందరు, తప్పనిసరి పరిస్థితుల్లో తలపెట్టిన పనికి మరికొందరు ఎంత ఎండలోనైనా వెళ్లాల్సి వస్తోంది. రెండు రోజులు వర్షపు జల్లుల వాతావరణాన్ని కాస్త చల్లబర్చినా తిరిగి యథాస్థితిలో ఎండలు కాస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో వివిధ వాహనాల్లో వెళ్లే ప్రయాణికులు ఉష్ణతాపానికి గురవుతున్నా.. పలు రహదారుల్లో కొంత మేర చెట్లు, వృక్షాలు నీడనిస్తున్నాయి. ఉపశమనం కలిగిస్తున్నాయి.

నాటి.. సంరక్షించి..

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు చాటేందుకు ప్రభుత్వాలు అటవీశాఖ ద్వారా రోడ్లకు ఇరువైపులా



రావులపాలెం- కొత్తపేట రహదారిలో మండపల్లి సమీపాన నీడనిస్తున్న చెట్లు

మొక్కలు నాటాయి. కొన్ని రోడ్లలో వాటికి నీరు పోసి, కంచెలు కట్టి సంరక్షించారు. ఫలితంగా అవి పెరిగి పెద్దవై ఇరువైపులా చెట్ల శివారు కొమ్మలు కలిసిపోయి రోడ్లపై పందిరిలా పరుచుకున్నాయి. కోనసీమ ప్రాంతంలో అలాంటి దృశ్యాలు చాలా చోట్ల కనిపిస్తుంటాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా అధికారం చేపట్టాక జగనన్న పచ్చతోరణం పేరిట పచ్చదనానికి ప్రాధాన్యం ఇచ్చారు. మొక్కలు నాటి, వాటిని సంరక్షించే కార్యక్రమం చేపట్టారు. దానితో ఎన్ని డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నా ఆ రహదారుల్లో ప్రయాణం చల్లగా సాగిపోతోంది.

జోరుగా శీతల పానీయాల విక్రయాలు

పలు రహదారుల్లో చెట్ల చెంతన సేదతీరుతూ శీతల పానీయాలు తాగుతూ ప్రయాణికులు వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. తోపుడు బండ్లపై, షాపుల్లో శీతల పానీయాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బత్తాయి, కర్బూజా, పుచ్చకాయ, బనానా, సపోటా తదితర పండ్ల జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు విక్రయాలతో చిరు వ్యాపారులు జీవనోపాధి పొందుతున్నారు.

దైవ స్మరణతో ధన్యులం అవుదాం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- పులిదిండిలో వేణుగోపాలస్వామి ఆలయానికి శంకుస్థాపన



ఆలయ శంకుస్థాపన పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, లావణ్య దంపతులు

ఆత్రేయపురం: ప్రతి ఒక్కరూ దైవస్మరణతో ధన్యులు కావాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం పులిదిండిలో వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన మహోత్సవం కనుల పండువగా జరిగింది. దీనికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి- లావణ్య దంపతులు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, సూర్యసుందర సీతాకుమారి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుడు పెనుగొండకు చెందిన ఖండవల్లి సూర్యనారాయణ ఆచార్యులు (రమణబాబు) ఆధ్వర్యంలో పూజా క్రతువులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఆలయం జీర్ణావస్థకు చేరడంతో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజుతో పాటు గ్రామస్తులు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రామస్తులు మరో రూ.25 లక్షలు ప్రభుత్వానికి జమ చేశారన్నారు. మరిన్ని విరాళాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు సమర్పించిన దాతలను అభినందించారు. దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబా, నాయకులు రాయి వెంకటేశ్వరరావు, పాల నాగేశ్వరరావు, కొల్లి శ్యామ్‌సన్, వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓలు ముదునూరి సత్యనారాయణరాజు, కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

పులిదిండిలో ఎమ్మెల్యే పర్యటన

పులిదిండి గ్రామంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎస్సీ ప్రాంతంలోని చర్చి స్లాబ్‌ను రూ.5 లక్షలతో నిర్మించాలని ప్రజలు కోరారు. దీంతో నిధులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సొసైటీ బ్యాంక్ శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేయించాలని పలువురు కోరగా డీసీసీబీ బ్రాంచ్ ద్వారా రూ.9 లక్షలు మంజూరు చేస్తామని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజూ మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. దీనిని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీపీ కండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ర్యాలి ఆంజనేయ స్వామివారి విగ్రహం

ఆత్రేయపురం: ర్యాలిలో 45 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం ఉదయం 8.48 గంటలకు జరిగింది. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో వివిధ పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, టీడీపీ నాయకులు బండారు సంజీవ్‌తో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు.

ర్యాలీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని రూ.50 వేల విరాళం ఇచ్చారు.



అప్పనపల్లిలో దాత కుటుంబానికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రామకృష్ణ

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో నిత్యాన్నదానానికి చింతనలంకకు చెందిన విళ్ల మణికంఠ, జ్యోతి దంపతులు రూ.50 వేలు విరాళంగా సమర్పించారు. తమ కుమారుడు దర్షిత్‌రన్‌వేద్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏడాది అక్టోబర్ 19న అన్నదానం చేయాలని విరాళం ఇచ్చారు. దాత కుటుంబ సభ్యులకు ఉప ప్రధానార్చకులు మద్దాలి తిరుమలశింగరాచార్యులు స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మలికిపురం: గూడపల్లి నూకాలమ్మ ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కించినట్లు ఆలయ చైర్మన్ సుందర నాగేశ్వరరావు, ఈఓ నాగ విష్ణు తెలిపారు. గత నెల రోజులకు గాను రూ.1.91 లక్షలు వచ్చాయన్నారు.

మీ సేవలకు వందనం



వక్కలంకలో వలంటీర్లతో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



అవిడిలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, సర్పంచ్ రెడ్డి చంటి

- దేశానికే వలంటీర్ వ్యవస్థ ఆదర్శం
- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అంబాజీపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వక్కలంక, కముజువారిలంక, పసుపల్లి గ్రామాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని సర్పంచులు వాసంశెట్టి రేవతి, సరస్వతుల సుబ్రహ్మణ్య ప్రసాద్, మట్టపర్తి నాగరాజుల అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా వారు పనిచేస్తున్నారన్నారు. అనంతరం వలంటీర్లను సేవా రత్న, వజ్ర, సేవామిత్ర పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే చిట్టిబాబుతో పాటు సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజులను సన్మానించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పిల్లి సత్యవతి, వాసంశెట్టి చినబాబు, వాసంశెట్టి పెదబాబు, జనుపల్లి ఏడుకొండలు, ముత్తాబత్తుల ప్రశాంత్, నాగాబత్తుల రాజేష్, రాయుడు కృష్ణ మహేష్ తదితరులు పాల్గొన్నారు. జగనన్న సీఎంగా, చిట్టిబాబు ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో వాడపల్లి వెంకన్నబాబు సన్నిధికి కాలినడకకు వెళ్లిన దొమ్మేటి నాగన్ననను ఎమ్మెల్యే సత్కరించారు.

సేవా భాగ్యం ఎనలేనిది

కొత్తపేట: ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని వలంటీర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. సోమవారం మండలంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. మోడేకుర్రు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, అవిడి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రెడ్డి చంటి అధ్యక్షతన జరిగిన సభల్లో ఎంపీపీ మాట్లాడారు. ఆదర్శ పాలన అందించేందుకు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వలంటీర్ వ్యవస్థను సీఎం జగన్ తీసుకువచ్చారన్నారు. జగనన్న పాలనలో ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా అర్హులైతే చాలు అన్ని పథకాలూ మంజూరవుతున్నాయన్నారు. సీఎం జగన్ పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం వలంటీర్లను సేవా పురస్కారాలతో సత్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం, కొత్తపేట హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, కుడుపూడి వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు సుంకర రెడ్డినాయుడు, సీహెచ్ శాంతి పాల్గొన్నారు.

అయినవిల్లి: కొండుకుదురు, పొట్టిలంక, శానపల్లిలంక, ఎస్.మూలపాలెం గ్రామాల్లోని సచివాలయ భవనాల వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు హాజరై వలంటీర్లను సత్కరించి, నగదు పురస్కారాలు అందజేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, మట్టపర్తి వెంకటరమణ, పంబల కుమారి, పచ్చిమాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధిగా..

- ఆదర్శవంతంగా జగనన్న పాలన
- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి



ఆలమూరులో పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: ప్రజా సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం ఆలమూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతా మహాలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక దేవి థియేటర్ నుంచి ఎస్సీ కాలనీ వరకూ ఈ కార్యక్రమం జరిగింది. నాలుగేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి లబ్ధిదారులకు గణాంకాలతో వివరించారు. పేదరిక నిర్మూలన కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుని ఇంటికే నేరుగా పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ నెక్కంటి వెంకట్రాయుడు, దేవస్థానం అధ్యక్షుడు వనుం సూరిబాబు, సర్పంచులు గుణ్ణం రాంబాబు, పెంటపాటి శ్యామల, వనుం చిన్నావతి పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ విజయం మనదే..



అప్పనపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయమని, అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అమలు చేస్తున్న పథకాలు అండగా నిలుస్తాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. సోమవారం అప్పనపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కొత్త కాలనీలో స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాలని ప్రజలు కోరగా తక్షణం సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, పీఏసీఎస్ చైర్మన్ గెడ్డం కృష్ణమూర్తి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, గ్రామశాఖ అధ్యక్షుడు బత్తుల జనార్దన్, పార్టీ నేతలు గెడ్డం వెంకటేశ్వరరావు, గెడ్డం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

రావులపాలెం: వ్యభిచార గృహంపై సోమవారం రావులపాలెం పోలీసులు దాడి చేశారు. ఇద్దరు నిర్వాహకులు, ఇద్దరు విటులను అరెస్టు చేశారు. ఎస్సై ఎం.వెంకటరమణ కథనం ప్రకారం.. స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్ సమీప భవనంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేశారు. వెదిరేశ్వరం గ్రామానికి చెందిన సయ్యపురాజు రామకృష్ణరాజుకు చెందిన ఇంటిని తాడేపల్లిగూడేనికి చెందిన మూడు లక్ష్మణరావు తన భార్యతో కలసి అద్దెకు తీసుకుని వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. రాజమహేంద్రవరానికి చెందిన మహిళలను (బాధితులు) ఇక్కడికి రప్పించి, రావులపాలెం గ్రామ పరిసర ప్రాంతాలలో విటులను ఆకర్షించి, వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత

ఆలమూరు: స్థానిక శ్రీవిక్రమ భట్టేశ్వరస్వామి ఆలయ అర్చకుడు అయిలూరి రామ హనుమాన్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా సొమ్ము అందజేశారు. సర్పంచ్ నేలపూడి లావణ్య, కార్యదర్శి కె.సంజీవ్‌రెడ్డి తదితరులు సోమవారం మృతుడి నివాసానికి వెళ్లి తొలుత ఖర్చుల నిమిత్తం రూ.పది వేలు అందజేశారు. మిగిలిన రూ.90 వేలను బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. నాతికుమార్‌రాజా, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలకు మజ్జిగ పంపిణీ

మలికిపురం: రామరాజులంక శివారు పెదతిప్ప వద్ద వేపచెట్టు డ్రెయిన్‌లో గుర్రపుడెక్కను తొలగిస్తున్న 150 మంది ఉపాధి కూలీలకు సర్పంచ్ కాకర శ్రీనివాస్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. పది రోజులుగా డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపుతో పాటు, పూడికతీత పనులను వారు నిర్వహిస్తున్నట్టు శివకుమార్ అన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి మెంబర్ గుబ్బల రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ చిట్టి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి డి.లక్ష్మీప్రసూన (ధవళేశ్వరం) రూ.20,116, సీహెచ్ వెంకట రాజేష్, నాగదీప్తి దంపతులు (ఆలమూరు మండలం పెనికేరు) రూ.10,116 చొప్పున విరాళాలు సమర్పించారు.